సాక్షి
ప్రకాశం

మంగళవారం । 30 । జూలై । 2024



వరుణా..చూపవా కరుణ
రాష్ట్రంలో పలుచోట్ల భారీ వర్షాలు కురుస్తుంటే ప్రకాశం జిల్లాలో తేలికపాటి జల్లులు తప్ప ఆశించిన వానలు లేవు. దీంతో కంభం చెరువు అడుగంటింది. - 8లో..



వాటర్‌షెడ్ బిల్లు.. ఖజానాకు చిల్లు
టీడీపీ అధికారంలోకి రాగానే ఆ పార్టీ నేతలు దోపిడీకి తెరలేపారు. వాటర్ షెడ్ పనుల్లో అడ్డగోలుగా బిల్లులు పెట్టి దోచుకుంటున్నారు. - 8లో..

గరిష్ఠం/కనిష్ఠం
37/29

వాతావరణం
ఆకాశం పాక్షికంగా మేఘావృతమై ఉంటుంది. ఒకటి రెండు చోట్ల ఉరుములు మెరుపులతో జల్లులు పడవచ్చు.

పెన్షన్ ఇచ్చి..రసీదు !

సామాజిక పింఛన్ల పంపిణీలో రాష్ట్ర ప్రభుత్వం రోజుకో నిబంధన విధిస్తోంది. తొలి నెలలో పింఛన్లు పంపిణీ చేసినప్పటి నుంచే రాష్ట్రంలో 2.50 లక్షల నకిలీ పింఛన్ లబ్ధిదారులున్నట్లు చెప్పిన కూటమి ప్రభుత్వం ఏదో ఒక వంకతో పింఛన్లకు కోత పెట్టేందుకు ప్రణాళికలు రచిస్తోంది. తాజాగా పింఛన్లు పంపిణీ చేసిన వెంటనే లబ్ధిదారులకు రసీదులు ఇవ్వాలని కొత్త నిబంధన విధించింది. సామాజిక బాధ్యతగా ఇచ్చే పింఛన్లకు వ్యాపారం తరహాలో రసీదులు ఎందుకంటున్న ప్రజా సంఘాలు మండిపడుతున్నాయి.



ఒంగోలు నగరంలోని శ్రీనగర్‌కాలనీలో దేవాలయంలో కూర్చొని గుంపుగా ఉన్న పింఛన్‌దారులకు పింఛన్ పంపిణీ చేస్తున్న వార్డు సచివాలయ ఉద్యోగి (ఫైల్)

- పింఛన్ల పంపిణీలో భారీ కోతకు రంగం సిద్ధం చేస్తున్నారన్న అనుమానాలు
- సామాజిక బాధ్యతగా ఇచ్చే పింఛన్లకు వ్యాపారం తరహాలో రసీదులు ఎందుకంటున్న ప్రజా సంఘాలు
- జిల్లాలో 2,91,419 సామాజిక పింఛన్లు

ఒంగోలు టౌన్:

పింఛన్ల పంపిణీపై రాష్ట్ర ప్రభుత్వం నానా తంటాలు పడుతోంది. కొత్త కొత్త నిబంధనలతో లబ్ధిదారులను గందరగోళంలో పడేస్తోంది. ఇంటి వద్దనే పింఛన్లు పంపిణీ చేస్తామంటూ ఎన్నికల సమయంలో హామీ ఇచ్చిన ప్రభుత్వం తొలి నెల జూన్‌లోనే పింఛన్ పంపిణీ సమయంలో ఇంటి వద్ద పంపిణీ చేయలేక చేతులెత్తేసింది. వలంటీర్ల పేరు వింటేనే అగ్గిమీద గుగ్గిలం అవుతున్న ప్రస్తుత పాలకులు పంపిణీ రోజు వరకు కూడా ఎవరి చేత పంపిణీ చేయించాలన్న స్పష్టతకు రాలేకపోయింది. దాంతో పింఛన్ పంపిణీ చేయడానికి వచ్చిన వివిధ శాఖల ఉద్యోగులు లబ్ధిదారుల చిరునామాలు తెలియక ఇబ్బంది పడ్డారు. తమకు కేటాయించిన ప్రాంతంలోని పాఠశాలలు, సచివాలయాలు, దేవాలయాలు, రచ్చబండల వద్ద కూర్చొని లబ్ధిదారులను అక్కడికి పిలిపించుకున్నారు. అప్పటి వరకు అసలు పెన్షన్ ఇస్తారో లేదో అన్న ఆందోళనలో ఉన్న లబ్ధిదారులు ఒక్కసారిగా రావడంతో కొన్ని ప్రాంతాల్లో తోపులాట జరిగింది. మరికొన్ని ప్రాంతాల్లో క్యూలో నిల్చోబెట్టి పింఛన్లు పంపిణీ చేశారు. దాంతో ఎండలో పడిగాపులు కాయలేక వృద్ధులు, వితంతువులు ఇబ్బంది పడ్డారు. ఎలాగోలా పింఛన్ పంపిణీ పూర్తి చేసి ఊపిరి పీల్చుకున్న ఉద్యోగులు ఈ అదనపు విధుల పట్ల చిరాకు వ్యక్తం చేస్తున్నారు. కొన్ని చోట్ల పింఛన్ పంపిణీలో చేతివాటం ప్రదర్శించినట్లు ఆరోపణలు వచ్చాయి. టీడీపీ నాయకులను ఈ కార్యక్రమంలో భాగస్వామ్యం చేయడంతో ప్రజా సంఘాలు మండిపడుతున్నాయి. దీనివలన రానురాను పింఛన్ల పంపిణీ కూడా మరో ఉచిత ఇసుక పథకంలాగా తయారైనా ఆశ్చర్యం లేదని పలువురు విమర్శలు గుప్పిస్తున్నారు.

రసీదు తీసుకుంటారట...

ఇదిలావుండగా జూలై నెల పింఛన్ల పంపిణీలో ప్రభుత్వం కొత్త నిబంధన విధించింది. పింఛన్ ఇచ్చినట్లు గుర్తుగా రసీదు తీసుకోనున్నట్లు అధికారులు ప్రకటించారు. జిల్లాలో 2,91,419 మందికి గాను ఎన్‌టీఆర్ భరోసా కింద పింఛన్లు పంపిణీ చేయనున్నట్లు డీఆర్‌డీఏ పీడీ వసుంధర సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఇందుకు సంబంధించి రూ.123.92 కోట్ల నిధులను ప్రభుత్వం విడుదల చేసిందని తెలిపారు. గ్రామ, వార్డు సచివాలయాల పరిధిలోని పెన్షన్ లబ్ధిదారులకు వారి ఇంటికి వెళ్లి పెన్షన్ పంపిణీ చేసి సర్టిఫికెట్ ఇచ్చి రసీదు తీసుకోనున్నట్లు వివరించారు. 1వ తేదీ ఉదయం 6 గంటలకు పింఛన్ల పంపిణీ మొదలుపెట్టి సాయంత్రం లోపు 99 శాతం పూర్తి చేయాలని ఉద్యోగులను నిర్దేశించారు. పింఛన్ల పంపిణీకి 5723 మంది సచివాలయ ఉద్యోగులతోపాటుగా ఇతర ప్రభుత్వ శాఖ సిబ్బంది ద్వారా పంపిణీ చేయనున్నారు.

పింఛన్లలో కోత పెట్టేందుకేనా...

గత ఐదేళ్లలో ఎన్నడూ లేనిది ఇప్పుడు ఈ కొత్త నిబంధనలు ఎందుకు పెడుతున్నారో అర్థంకావడం లేదని కొందరు పింఛన్ లబ్ధిదారులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. అప్పటి ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్ రెడ్డి హయాంలో ప్రతి నెలా వలంటీర్లు ఇంటి వద్దకు వచ్చి పింఛన్లు ఇచ్చేవారు. సేవా దృక్పథంలో పింఛన్లు పంపిణీ చేసేవారు. ఇందుకుగాను ఎప్పుడూ ఒక్క రూపాయి లంచం తీసుకోవడం లాంటి సంఘటనలు ఒక్కటి కూడా జరగలేదు. సూపర్ సిక్స్ అంటూ అలవికాని హామీలు ఇచ్చి అధికారంలోకి వచ్చిన తెలుగుదేశం కూటమి ప్రభుత్వం ఇప్పటికే అనేక పథకాలను అటకెక్కించింది. తొలి నెలలో పింఛన్లు పంపిణీ చేసినప్పటి నుంచే రాష్ట్రంలో 2.50 లక్షల నకిలీ పింఛన్ లబ్ధిదారులున్నట్లు వ్యూహాత్మకంగా ప్రచారం మొదలు పెట్టింది. రెండో నెల పంపిణీ సమయంలోనే పింఛన్లు ఇచ్చి రసీదులు తీసుకుంటామని చెబుతున్నారు. సామాజిక పింఛన్ల పంపిణీ అనేది ప్రభుత్వ సామాజిక బాధ్యత. కానీ అదేదో హెరిటేజ్ వ్యాపారం అన్నట్లు రసీదులు ఇస్తామని చెప్పడం పట్ల ప్రజా సంఘాలు ఆశ్చర్యం వ్యక్తం చేస్తున్నాయి. పింఛన్లలో భారీ కోత పెట్టే కుట్రలు జరుగుతున్నట్లు అనుమానాలు వ్యక్తం చేస్తున్నారు.



ఒంగోలు వడ్డెవానికుంటలో వీధిలో రోడ్డుపై మహిళలకు పింఛన్ ఇస్తున్న సచివాలయ ఉద్యోగి (ఫైల్)

న్యూస్‌రీల్

ఒలింపిక్స్‌లో క్రీడాకారులు ప్రతిభ చూపాలి

- జాయింట్ కలెక్టర్ గోపాలకృష్ణ



ఒలింపిక్స్ సెల్ఫీ పాయింట్‌ను ఆవిష్కరించిన జాయింట్ కలెక్టర్ గోపాలకృష్ణ

ఒంగోలు అర్బన్: పారిస్ వేదికగా జరుగుతున్న ఒలింపిక్స్‌లో రాష్ట్రం నుంచి పాల్గొంటున్న క్రీడాకారులు మెరుగైన ప్రతిభ చూపాలని క్రీడాకారులు రాష్ట్రానికి మంచి పేరు తీసుకురావాలని జాయింట్ కలెక్టర్ గోపాలకృష్ణ కోరారు. సోమవారం ప్రకాశం భవనంలో ఏర్పాటు చేసిన ఒలింపిక్స్ సెల్ఫీ పాయింట్‌ను ఆవిష్కరించి అంతర్జాతీయ స్థాయిలో జరుగుతున్న క్రీడల్లో భారత్ తరపున ప్రాతినిధ్యం వహించే అవకాశం పొందిన క్రీడాకారులు పీవీ సింధు, ఆర్ సాత్విక్, సాయిరాజు, వై జ్యోతి, డీ జ్యోతికశ్రీ, ధీరజ్‌లకు అభినందనలు తెలుపుతూ సెల్ఫీ దిగారు. ప్రజలంతా క్రీడాకారులకు అభినందనలు తెలుపుతూ అండగా నిలవాలని సూచించారు. దీనిలో జిల్లా క్రీడల అభివృద్ధి అధికారి రాజరాజేశ్వరి ఇతర అధికారులు పాల్గొన్నారు.

సమస్యలు స్థానికంగానే పరిష్కరించాలి

- గ్రీవెన్స్ నిర్వహించిన జాయింట్ కలెక్టర్ గోపాలకృష్ణ



గ్రీవెన్స్‌లో అధికారులతో మాట్లాడుతున్న జాయింట్ కలెక్టర్ గోపాలకృష్ణ

ఒంగోలు అర్బన్: స్థానిక సమస్యలు స్థానికంగానే పరిష్కరించాలని ఆ సమస్యలు జిల్లా స్థాయి వరకు రాకూడదని జాయింట్ కలెక్టర్ గోపాలకృష్ణ సూచించారు. సోమవారం ప్రకాశం భవనంలో ప్రజా సమస్యల పరిష్కార వేదిక గ్రీవెన్స్ కార్యక్రమాన్ని నిర్వహించి ప్రజల నుంచి అర్జీలు స్వీకరించారు. అనంతరం మాట్లాడుతూ ప్రజా సమస్యల పరిష్కారంలో అధికారులు చిత్తశుద్ధితో వ్యవహరించాలన్నారు. క్షేత్ర స్థాయిలో పరిశీలించి సమస్యలను పరిష్కరించాలని ఆ సమస్య తిరిగి పునరావృతం కాకుండా పనిచేయాలన్నారు. మురుగు కాలువల పూడికతీత, వంగిపోయిన విద్యుత్ స్తంభాలు సరిచేయడం వంటి చిన్న సమస్యలు కూడా కలెక్టరేట్‌కు వచ్చి ఫిర్యాదు చేస్తున్నారంటే స్థానిక అధికారులు ఏం చేస్తున్నారని ప్రశ్నించారు. జిల్లా అధికారులు ఆయా శాఖలపై పర్యవేక్షణ ఉంచి పనితీరును మెరుగు పరచాలన్నారు. దీనిలో డీఆర్‌ఓ విశ్వేశ్వరరావు, స్పెషల్ డిప్యూటీ కలెక్టర్లు లోకేశ్వరరావు, మాధురి, వరకుమార్, ఇతర జిల్లా అధికారులు పాల్గొన్నారు.

దివ్యాంగుడికి శ్రవణ యంత్రం అందజేసిన జేసీ

ఒంగోలు అర్బన్: ప్రకాశం భవనంలో సోమవారం గ్రీవెన్స్ హాలులో దివ్యాంగుడికి జాయింట్ కలెక్టర్ గోపాలకృష్ణ శ్రవణ యంత్రం అందజేశారు. గ్రీవెన్స్‌లో నగరానికి చెందిన లక్కవరపు భాస్కర్ (15)కు పుట్టుకతో వినికిడి సమస్య ఉందని, దీంతో దైనందిన జీవితానికి ఇబ్బంది ఉన్నట్లు జాయింట్ కలెక్టర్‌కు తెలిపారు. అదేవిధంగా కురిచేడు మండలం నాయుడుపాలెంకు చెందిన మొగిలి మునీంద్రకు వీల్ చైర్ ఇప్పించాలని గ్రీవెన్స్‌లో కోరాడు. స్పందించిన జాయింట్ కలెక్టర్ దివ్యాంగుల సంక్షేమ శాఖ ఏడీ అర్చనను వెంటనే వారికి న్యాయం చేయాలని ఆదేశించారు. భాస్కర్‌కు శ్రవణ యంత్రం వెంటనే అందజేయగా మహేంద్రకు త్వరలో వీల్ చైర్ ఏర్పాటు చేస్తామని భరోసా ఇచ్చారు. దీనిలో డీఆర్‌ఓ విశ్వేశ్వరరావు, ఇతర అధికారులు ఉన్నారు.

నారాయణస్వామి ఆలయ ఆదాయం రూ.2.44 లక్షలు

సీఎస్‌పురం (పామూరు): మండలంలోని మిట్టపాలెం నారాయణస్వామివారి ఆలయానికి ఆదివారం రూ.2,44,650 ఆదాయం వచ్చినట్లు ఆలయ వ్యవస్థాపక చైర్మన్ కొమ్మినేని చిన ఆదినారాయణ, ఈవో శ్రీగిరిరాజు నరసింహబాబు సోమవారం తెలిపారు. స్వామివారి దర్శనం టికెట్ల అమ్మకం ద్వారా రూ.95,540, లడ్డుప్రసాదాల అమ్మకం రూ.75,640, ఆలయం వద్ద నిర్వహిస్తున్న శాశ్వత అన్నదానం పథకం నిర్వహణకు విరాళాలుగా రూ.33,211, మహాప్రాకార నిర్మాణానికి రూ.35,143, శాశ్వత పూజలకు విరాళంగా రూ.5,116 విరాళాలుగా వచ్చినట్లు ఈఓ, చైర్మన్‌లు తెలిపారు. కార్యక్రమంలో కొమ్మినేని వెంకట్రావు పాల్గొన్నారు.

ఎస్సీ హాస్టల్ తనిఖీ



బాత్రూమ్స్ వెనుక మురుగు తొలగించి బ్లీచింగ్ వేసి ఉన్న దృశ్యం

సాక్షి ఎఫెక్ట్..

కంభం: ఎస్సీ బాలికల హాస్టల్‌లో సమస్యలపై సాక్షి దినపత్రికలో సోమవారం 'సమస్యలు ఇలా చదివేదెలా' అన్న శీర్షికతో వచ్చిన కథనానికి స్పందించిన సహాయ సాంఘిక సంక్షేమాధికారిణి రాజేశ్వరమ్మ ఎస్సీ బాలికల హాస్టల్‌ను తనిఖీ చేశారు. హాస్టల్‌లో ఉన్న మురుగు, వ్యర్థాలను ట్రాక్టర్ ద్వారా తొలగించి బ్లీచింగ్ చేయించారు. హాస్టల్‌లో సమస్యలు, మౌలిక వసతుల మెరుగు పర్చేందుకు రిపోర్టు రాసి ఉన్నతాధికారులకు పంపిస్తున్నట్లు ఆమె తెలిపారు.

గిద్దలూరు ఎస్సీ హాస్టల్ వార్డెన్‌పై చర్యలు తీసుకోవాలి

ఒంగోలు టౌన్: హాస్టల్ నిర్వహణపై నిర్లక్ష్యం వహిస్తున్న గిద్దలూరు ఎస్సీ హాస్టల్ వార్డెన్ రాజేష్‌పై చర్యలు తీసుకోవాలని ఎస్‌ఎఫ్‌ఐ జిల్లా నాయకులు సోమవారం జాయింట్ కలెక్టర్‌కు ఫిర్యాదు చేసినట్లు సమాఖ్య జిల్లా కార్యదర్శి సీహెచ్ వినోద్ ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లా వ్యాప్తంగా హాస్టళ్లను సర్వే చేస్తున్న సందర్భంగా గిద్దలూరు ఎస్సీ హాస్టల్ పరిస్థితులను చూసి నివ్వెరపోయామన్నారు. హాస్టల్ గదుల్లో కరెంటు తీగలు తెగి ఉన్నా పట్టించుకోక పోవడం ఆశ్చర్యానికి గురిచేసిందన్నారు. ఒకవేళ ఏదైనా పొరపాటు జరిగితే ఎవరు బాధ్యత వహిస్తారని ఆయన ప్రశ్నించారు. మరుగుదొడ్లు లేవని, రూముల్లోని కిటికీలు, మెస్‌లు రిపేర్లలో ఉన్నాయని, మెస్ నిర్వహణ సరిగ్గా లేదని, హాస్టల్ పరిసరాలు ఏమాత్రం బాగా లేవని తెలిపారు. వార్డన్ రాజేష్ సక్రమంగా విధులకు రావడం లేదని తమ సర్వేలో తేలిందని, హాస్టల్ విద్యార్థుల బాగోగులను పట్టించుకోవడం లేదన్నారు. వెంటనే తగిన చర్యలు తీసుకోవాలని కోరారు.

పేదల పథకాలు ఎగ్గొట్టేందుకు కుట్రలు

- ప్రశ్నించకుండా భయపెట్టేందుకే ఆటవిక, అరాచక పాలన
- ఏడు నెలలు ఓటాన్ అకౌంట్‌కు వెళ్లడం ఎప్పుడూ జరగలేదు
- ప్రజలు ప్రశ్నించకుండా దాడులతో భయాన్ని కల్పిస్తున్నారు
- దర్శి ఎమ్మెల్యే డాక్టర్ బూచేపల్లి శివప్రసాద్‌రెడ్డి



దర్శి ఎమ్మెల్యే డాక్టర్ బూచేపల్లి శివప్రసాద్‌రెడ్డి

దర్శి: పేదల పథకాలు ఎగ్గొట్టేందుకు చంద్రబాబు కుట్రలు చేస్తున్నారని దర్శి ఎమ్మెల్యే డాక్టర్ బూచేపల్లి శివప్రసాద్‌రెడ్డి విమర్శించారు. సోమవారం మీడియాతో మాట్లాడారు. ఆయా శాఖల ఆదాయ వ్యయాలు చెప్పాల్సి వస్తుందని చంద్రబాబు పూర్తి బడ్జెట్‌ను ప్రవేశ పెట్టకుండా గతంలో ఎప్పుడూ లేని విధంగా ఏడు నెలల పాటు ఓటాన్ అకౌంట్‌కు వెళ్లారన్నారు. చంద్రబాబు అధికారంలో ఉన్నా ప్రతిపక్షంలో ఉన్నా తన మీడియా శక్తుల ద్వారా ఒక పథకం ప్రకారం పార్టీలను, కుటుంబాలను, వ్యక్తులను, వ్యవస్థలను టార్గెట్ చేసుకుంటూ పోతారన్నారు. రాష్ట్రంలో రూ.7.48 లక్షల కోట్లు అప్పు ఉంటే ఎన్నికల దగ్గర నుంచి తన మీడియా ద్వారా రూ.14 లక్షలు కోట్లు అప్పులు ఉన్నాయని చెప్పించి అసెంబ్లీలో గవర్నర్ ప్రసంగంలో రూ.10 లక్షల కోట్లు ఉందంటూ అబద్ధాలు చెప్పించారన్నారు. 2019 మే 30న వైఎస్సార్ సీపీ అధికారంలోకి వచ్చే సరికి అప్పటి రాష్ట్ర ఖజానా రూ.100 కోట్లని, అంతటి కష్టంలో ఉన్నా 2017 జులై 12న రాష్ట్రంలో బడ్జెట్ ప్రవేశ పెట్టామన్నారు. వరుసగా ఐదేళ్లలో పేదల ఖాతాల్లో రూ.2.71 లక్షల కోట్లు వివక్షకు తావులేకుండా పార్టీలు చూడకుండా చివరికి టీడీపీ వారికి కూడా డీబీటీ వేశామని చెప్పారు. చంద్రబాబు ప్రమాణ స్వీకారం రోజుకు ఖజానాలో మొత్తంగా రూ.7 నుంచి రూ.8 వేల కోట్లు అందుబాటులో ఉన్నాయన్నారు. అంత వెసులుబాటు ఉన్నా బడ్జెట్ ప్రవేశ పెట్టకుండా ప్రజలను మోసగించి వాగ్దానాల నుంచి తప్పించుకునేందుకు పన్నాగం పన్నారని చెప్పారు. పూర్తి స్థాయి బడ్జెట్ ప్రవేశ పెడితే సూపర్ సిక్స్‌కు ఎంత పెడుతున్నారో చంద్రబాబు చెప్పాల్సి వస్తుందని, ఎన్నికల్లో తాను చేసిన మోస పూరిత హామీలను ప్రజలు ఎక్కడ ప్రశ్నిస్తారో అనే భయం చంద్రబాబును వెంటాడుతోందన్నారు. అందుకే ప్రజలెవరూ ప్రశ్నించకుండా అణిచివేతకు పాల్పడుతున్నారన్నారు. రెడ్‌బుక్ రాజ్యాంగాన్ని ఏర్పాటు చేసి అందులో పేర్లున్న వారిని ఎలా టార్గెట్ చేయాలో చంద్రబాబు, లోకేష్ ఆదేశాల మేరకు దగ్గరుండి ఇవన్నీ చేస్తున్నారని చెప్పారు. రాష్ట్రంలో ప్రజాస్వామ్యం నడుస్తుందా లేక ముఠారాజ్యం, మాఫియారాజ్యం నడుస్తుందా అని ప్రశ్నించారు. ఆంధ్రప్రదేశ్ అంటే అరాచకం, ఆటవిక పాలన అనే బ్రాండ్‌ను 50 రోజుల్లోనే తీసుకొచ్చారని చెప్పారు. చంద్రబాబు హామీలు ఎవరూ ప్రశ్నించకుండా నిరంతరం భయంలో ఉంచాలని ఇవన్నీ చేయిస్తున్నారన్నారు. సీఎంగా జగనన్న ఉండి ఉంటే ఈపాటికే అమ్మఒడి, రైతు భరోసా, విద్యార్థులకు ఫీజు రీయింబర్స్‌మెంట్ వచ్చేవన్నారు. అమ్మఒడి పేరు మార్చి తల్లికి వందనం అని చెప్పి ఎంతమంది పిల్లలు ఉంటే అంతమందికి ఇస్తామని హామీ ఇచ్చి జీఓను మాత్రం ఇప్పటికీ మార్చలేదని చెప్పారు. శాసనసభలో ఈ ఏడాది కాదు వచ్చే ఏడాది అని అమ్మ ఒడికి స్మార్ట్‌గా సున్నం పెట్టారన్నారు. ఖరీఫ్ మొదలైనా ఇప్పటికీ రూ.20 వేలు ఇస్తామన్న రైతు భరోసా అతీ గతీ లేదని మండిపడ్డారు. ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే కట్టాల్సిన ఉచిత పంటల బీమా కట్టకపోవడంతో తీవ్రంగా దెబ్బతింటామని లక్షలాది మంది రైతులు ఆందోళనలో ఉన్నా ప్రభుత్వానికి మాత్రం చీమకుట్టినట్లైనా లేదన్నారు. నిరుద్యోగులకు రూ.3 వేలు నిరుద్యోగ భృతి, డ్వాక్రా అక్క చెల్లెమ్మలకు సున్నా వడ్డీ, మత్స్యకార భరోసా కింద నెలకు రూ.20 వేలు ఇస్తామని ఓట్లు తీసుకున్నారు కానీ వారిని పట్టించుకోవడం లేదన్నారు.

దొంగే దొంగ అన్నట్లు పోలవరం వ్యవహారం:

దొంగే దొంగ అన్నట్లుగా పోలవరం వ్యవహారం ఉందని చంద్రబాబు అధికారంలో ఉన్నప్పుడు పోలవరం ప్రస్తావన చేయకుండా కేంద్రం చేయాల్సిన ప్రాజెక్ట్‌ను తన చేతుల్లోకి తీసుకుని 2013–14 రేట్లకే అంటే ఇరిగేషన్ కాంపొనెంట్ కింద ప్రాజెక్ట్ వ్యయం రూ.20,398 కోట్లకే ఒప్పుకుని పోలవరానికి ఉరేయలేదా అని ప్రశ్నించారు. అస్మదీయ కంపెనీలకు నామినేషన్ పద్ధతిలో కాంట్రాక్టులు ఇచ్చి అవినీతికి పాల్పడిన మాట నిజం కాదా అని ప్రశ్నించారు. స్వయంగా ప్రధాని మోదీ చంద్రబాబు ఏటీఎం ప్రాజెక్ట్‌గా పోలవరం మారిందని వేలాది మంది ప్రజల ముందు చెప్పలేదా అని ప్రశ్నించారు. ప్రాజెక్ట్ నిర్మాణంలో ముఖ్యమైన పనులు వదిలేసి డబ్బులు వచ్చే పనులు చేయించారన్నారు. కాఫర్ డ్యాం పాపాలను కడిగేసుకోవడానికి నానా కథలు చెప్తున్న చంద్రబాబు మేం కట్టిన స్పిల్‌వే పై కారేసుకుని హాయిగా వెళ్లలేదా అని ప్రశ్నించారు. వర్షాకాలంలో నిర్మాణ రంగానికి ఎలాంటి ఇబ్బందులు లేకుండా స్టాక్ యార్డ్‌లలో దాదాపు 80 టన్నులు ఇసుక నిల్వ చేస్తే నువ్వు మీ అబ్బాయి సెల్ఫీలు దిగుతూ తప్పుడు ప్రచారం చేశారని, ఎన్నికల ఫలితాల తరువాత అక్కడ ఇసుక మొత్తం ఎత్తుకుని పోయారన్నారు. అలా ఏకంగా 40 లక్షల టన్నుల ఇసుకను దోపిడీ చేసి అమ్ముకున్న వారిపై చర్యలు తీసుకునే దమ్ము, ధైర్యం ఉందా అని ప్రశ్నించారు. చంద్రబాబుకు పోలవరం ఎప్పటి కడతారో తెలియదని, హామీలు ఎప్పటి నుంచి అమలు చేస్తారన్నా సమాధానం ఉండదని, అమరావతి ఎప్పుడు కడతారంటే నువ్వు చెప్పు అని ఎదురు ప్రశ్న వేస్తారన్నారు. ఎన్నికల్లో చెప్పినట్లు ట్రూ అప్ కరెంట్ చార్జీలు ఎప్పుడు తగ్గిస్తావంటే నోరు మెదపడు...ఇసుక ఉచితం అన్నావు ఇప్పుడు ఇంతలా అమ్ముతున్నావంటే ఏం మీ ఇంటికి తెచ్చి పోస్తానని చెప్పానా అంటాడు.. మెగా అంటే ఏంటని డీఎస్సీ మీద ప్రశ్నించినా సమాధానం ఉండదన్నారు. ఆ రిక్రూట్‌మెంట్ కూడా వాయిదా వేసుకుంటూ వెళ్లారని అన్నారు. వలంటీర్లకు రూ.10 వేలు ఇస్తానని వారిని రోడ్డున పడేశారన్నారు. ఇంటింటికీ రేషన్ సప్లైని ఆపేశారని చెప్పారు. ఇవన్నీ అడగకూడదని హత్యలు, దాడులు, దౌర్జన్యాలు, ఆస్తులకు నష్టం చేయడం, ఒక భయాన్ని కలిగించేలా ఇవాళ రాష్ట్రంలో ప్రభుత్వ తీరు ఉందన్నారు.

బడ్జెట్ ప్రతుల దహనం



బడ్జెట్ ప్రతులను దహనం చేస్తున్న రైతు కూలీ సంఘాల నాయకులు

- కేంద్ర బడ్జెట్‌ను ప్రతి ఒక్కరూ వ్యతిరేకించాలి
- వ్యవసాయరంగ ద్రోహి మోదీ

ఒంగోలు టౌన్: రైతు, కూలి, ప్రజా వ్యతిరేక కేంద్ర బడ్జెట్‌ను ప్రతి ఒక్కరూ వ్యతిరేకించాలని సంయుక్త కిసాన్ మోర్చా జిల్లా కన్వీనర్ చుండూరి రంగారావు పిలుపునిచ్చారు. కేంద్ర బడ్జెట్లో రైతు కూలీలకు చేసిన ద్రోహాన్ని నిరసిస్తూ సోమవారం కలెక్టరేట్ ఎదుట వివిధ ప్రజా సంఘాల ఆధ్వర్యంలో బడ్జెట్ ప్రతులను దహనం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వ్యవసాయ రంగానికి రెట్టింపు ఆదాయం అని చెప్పి నిధుల కేటాయింపుల్లో మాత్రం దానికి విరుద్ధంగా వ్యవహరించారని ప్రధాన మంత్రి మోదీ పై మండిపడ్డారు. ఉత్పత్తి ధరలకు 50 శాతం అదనంగా కలిపి మద్దతు ధర ప్రకటించాల్సి ఉండగా ప్రస్తుతం 28 నుంచి 35 శాతం మాత్రమే ఉన్నాయని చెప్పారు. పేదల సబ్సిడీలను భారీగా కోతలు పెట్టిన దివాలా ప్రభుత్వం అని విమర్శించారు. కార్మికుల శ్రమను దోపిడీ చేసి కార్పొరేట్ శక్తులకు పంచిపెడుతున్న ఈ ప్రభుత్వ నిరంకుశ చర్యలకు వ్యతిరేకంగా దేశ ప్రజలు గళమెత్తాలని ఏఐటీయూసీ జిల్లా ఉపాధ్యక్షుడు పీవీఆర్ చౌదరి, సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు జీవీ కొండారెడ్డి విమర్శించారు. గ్రామీణ ప్రాంత నిరుపేదల జీవనోపాధిని దెబ్బతీస్తూ ఉపాధి హామీ పథకానికి కేవలం రూ.1.25 కోట్లు మాత్రమే కేటాయించడం దారుణం అని వ్యవసాయ కార్మిక సంఘాల నాయకులు చిట్టిపాటి వెంకటేశ్వర్లు, భీమవరపు సుబ్బారావు ధ్వజమెత్తారు. నిరసన కార్యక్రమంలో పీవోడబ్ల్యూ నాయకురాలు పద్మ, సుల్తాన్ బాషా, జీ.రమేష్, పల్లా హనుమంతరావు, బాలకోటయ్య, అయ్యప్పరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

1 నుంచి గ్రానైట్ ఫ్యాక్టరీల సమ్మె

చీమకుర్తి: వచ్చేనెల 1వ తేదీ నుంచి 3 సెం.మీ మందం కలిగిన గ్రానైట్ స్లాబ్‌లకు చెందిన ఫ్యాక్టరీల యజమానులు సమ్మె చేస్తున్నట్లు ఫ్యాక్టరీల సంఘం తీర్మానించింది. బూదవాడ, మర్రిచెట్లపాలెం, ఒంగోలు, గుండ్లాపల్లి గ్రోత్ సెంటర్‌ల పరిధిలోని 3 సెం.మీ ఫ్యాక్టరీల యజమానులందరూ కలిసి ఏకగ్రీవంగా తీసుకున్న నిర్ణయానికి అందరూ మద్దతు తెలిపినట్లు ఫ్యాక్టరీల సంఘం నాయకుడు మందా రామారావు సోమవారం తన ప్రకటనలో తెలిపారు. బయ్యర్లు సిండికేట్ కావడం, గిట్టుబాటు ధర రాకుండా చేయటం, స్పాట్ పేమెంట్ అయితే ధరను ఇంకా తగ్గించటం వంటి విధానాలకు కొనుగోలుదారులు పాల్పడుతుండటంతో నిరసన వ్యక్తం చేస్తూ సమ్మెకు పిలుపునిచ్చినట్లు రామారావు తెలిపారు.

వైభవంగా వేల్ కావడి

ఒంగోలులోని స్కందగిరిలో కృత్తికా దీపోత్సవం సందర్భంగా వేల్ కావడి నగరోత్సవం వైభవంగా సాగింది. సుబ్రహ్మణ్యేశ్వర స్వామి భక్తులు కావడిలు మోస్తూ శూలాలు గుచ్చుకుని తమ భక్తిని చాటుకున్నారు. – ఒంగోలు మెట్రో



సుబ్రహ్మణ్యేశ్వర స్వామి ఉత్సవమూర్తి



వేల్ కావడి ఉత్సవంలో భక్తజనం



కావడిలు మోస్తున్న మహిళలు



వీపునకు కొక్కేలు గుచ్చుకుని చిన్న రథం లాగుతున్న భక్తుడు

క్లుప్తంగా

పచ్చిమేతతో మెరుగైన పాల దిగుబడి



రైతులకు అవగాహన కల్పిస్తున్న జేడీ బేబీరాణి

నాగులుప్పలపాడు: పాడి పశువుల్లో పాల ఉత్పత్తి అనేది పచ్చిమేతపైనే ఎక్కువగా ఆధారపడి ఉంటుందని పశుసంవర్ధకశాఖ జాయింట్ డైరెక్టర్ డాక్టర్ బేబీరాణి తెలిపారు. నాగులుప్పలపాడులోని పశువైద్య కేంద్రంలో పాడి రైతులకు సోమవారం ఉచితంగా పశుగ్రాస విత్తనాలు పంపిణీ చేశారు. సీఎస్‌హెచ్‌-24 ఎంఎఫ్ విత్తనాలు పంపిణీ చేసిన జేడీ మాట్లాడుతూ ఈ గడ్డి విత్తనాలు పశువులకు చాలా ఉపయోగపడతాయన్నారు. అలాగే 75 శాతం సబ్సిడీపై పీసీ-6 అనే గడ్డి రకం విత్తనాలను పశువైద్య కేంద్రాల వద్ద అందించనున్నట్లు తెలిపారు. రైతుల అభివృద్ధి కోసం గోకులం షెడ్ల నిర్మాణానికి సబ్సిడీ అందించనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో డాక్టర్ నాగభూషణరావు, పశువైద్య సిబ్బంది పాల్గొన్నారు.

అట్రాసిటీ కేసుపై విచారణ

నాగులుప్పలపాడు: మండలంలోని ఉప్పుగుండూరు గ్రామ సర్పంచ్‌పై అనుచితంగా ప్రవర్తించి కులం పేరుతో దూషించినట్లు నమోదైన ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసుపై ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ డీఎస్పీ శ్రీనివాసరావు సోమవారం విచారణ చేపట్టారు. ఉప్పుగుండూరు గ్రామానికి చెందిన సర్పంచ్ దేవరకొండ జయమ్మ గ్రామంలో అభివృద్ధి పనులపై కార్యదర్శి హరిబాబును ప్రశ్నించడంతో ఎస్టీ సామాజిక వర్గానికి చెందిన నీకు నాపై పెత్తనం ఏంటని కులం పేరుతో దూషించడంతో పాటు 14వ వార్డు సభ్యుడు కనగాల శ్రీనివాసరావు కూడా సర్పంచ్‌ను దూషించారని అట్రాసిటీ కేసు నమోదైంది. సోమవారం డీఎస్పీ శ్రీనివాసరావు గ్రామ పంచాయతీ కార్యాలయంలో సిబ్బంది, గ్రామస్తులను విచారించారు. విచారణలో నివేదిక ప్రకారం తదుపరి చర్యలు తీసుకుంటామని డీఎస్పీ తెలిపారు.



అడుగంటిన చారిత్రాత్మక కంభం చెరువు

కంభం చెరువు నీటి సామర్థ్యం 3.30 టీఎంసీలు
ప్రస్తుతం చెరువులో ఉన్న నీటి మట్టం 3 అడుగులు
సాగు విస్తీర్ణం అధికారికంగా 6,944 ఎకరాలు
అనధికారికంగా 12 వేల ఎకరాలు



బోర్ల నీరు సరిపోక వాడిపోతున్న అరటి

వరుణా.. చూపవా కరుణ!

- వర్షం కోసం అన్నదాతల ఎదురుచూపులు
- అడుగంటిపోతున్న చారిత్రాత్మక కంభం చెరువు
- వర్షం కురిస్తే మిరప, పత్తి సాగుకు అనుకూలం
- నారుమడులు సిద్ధం చేసుకుంటున్న రైతన్నలు

కంభం: రాష్ట్రంలో పలుచోట్ల భారీ వర్షాలు కురిసి వాగులు, వంకలు ఉప్పొంగుతుంటే పశ్చిమ ప్రకాశంలో మాత్రం తేలికపాటి జల్లులు మినహా ఆశించిన స్థాయిలో వానలు పడటం లేదు. ఫలితంగా చారిత్రాత్మక కంభం చెరువు అడుగంటిపోయింది. ప్రస్తుతం చెరువులో మూడు అడుగుల మేర నీరు ఉన్నప్పటికీ అది భూగర్భ జలాల పెంపునకు ఉపయోగపడి, తాగునీటి సమస్యను కొంత మేర నివారించగలుగుతుందే తప్పా వ్యవసాయం చేసుకునే అన్నదాతలను ఆదుకోలేకపోతోంది.

ఖాళీ అవుతున్న కంభం చెరువు

గతంలో కంభం చెరువు నిండితే మూడేళ్ల వరకు రైతులు రెండు పంటలు పండించుకునే వారు. ప్రస్తుతం రైతులకు ఆ పరిస్థితులు లేవు. ఈ ఏడాది వర్షాలు కురకపోవడంతో కంభం చెరువు క్రమంగా అడుగంటిపోతోంది. నల్లమల అటవీ ప్రాంతంలోనూ భారీ వర్షాలు కురవకపోవడంతో చెరువుకు చుక్కనీరు చేరలేదు. ప్రస్తుతం మూడు అడుగుల నీరే ఉన్నా వరుణుడిపై భారం వేసి ఆయకట్టు రైతులు సాగుకు సిద్ధమవుతున్నారు.

వర్షం కోసం ఆశగా..

చారిత్రాత్మక కంభం చెరువు కింద అధికారికంగా 6944 ఎకరాలు, అనధికారికంగా 12 వేల ఎకరాలు ఆయకట్టు ఉంది. చెరువుకింద పోరుమామిళ్లపల్లి, చిన్నకంభం, హజరత్‌గూడెం, కంభం గ్రామాల్లో మాగాణి భూములు ఉండగా అక్కడి రైతులు వరి, పసుపు, అరటి సాగు చేస్తారు. వీరితో పాటు ఇతర గ్రామాల్లో 5 వేల ఎకరాల్లో కంది, పత్తి, మిరప, సజ్జ, కొర్ర, ఇతర పంటలు సాగు చేస్తారు. చెరువుకు సమీపంలో ఉన్న పంట పొలాల్లో రైతులు బోర్ల కింద ఇప్పటికే అరటి, పసుపు పంటలు వేసుకున్నారు. 4465 ఎకరాల్లో మెట్ట పైర్లు వేయాల్సి ఉండగా వర్షాలు సక్రమంగా కురవకపోవడంతో ఇప్పటి వరకు 1,220 ఎకరాల్లో మాత్రమే రైతులు పంటలు వేశారు. ఖరీఫ్ సీజన్ ముగుస్తున్నా పంటలు సాగు చేసేందుకు పదునైన వానలు పడకపోవడంతో రైతులు ఆందోళన చెందుతున్నారు. వర్షం పడితే మిరప, పత్తి వేయాలని రైతులు ఆశగా ఎదురుచూస్తున్నారు.



ఆయకట్టు పరిధిలో సాగుకు సిద్ధం చేసిన పొలాలు

నారుమడులు సిద్ధం

చెరువు కింద పొలాలు ఉన్న రైతులు ఇప్పటికే డీప్ బోర్ల నీటితో పంటలు సాగు చేయడానికి నారుమడులు సిద్ధం చేస్తున్నారు. భూమి సారవంతం కోసం జనుము, పెసర తదితర పచ్చిరొట్ట పైర్లు సాగు చేశారు. వర్షాలు పడితే పచ్చిరొట్ట పంటను పొలంలో కలియదున్ని వరి నాటేందుకు వేచి చూస్తున్నారు.

ఎండుతున్న పంటలు

చెరువు ఆయకట్టు పరిధిలో బోర్ల కింద పలువురు రైతులు అరటి, పసుపు, బత్తాయి సాగు చేస్తున్నారు. ఇటీవల కాలంలో చెరువుకు దూరంగా ఉన్న ప్రాంతంలోని పొలాల్లో బోర్లు అడిగంటిపోవడంతో పంటలకు సరిపడా నీరందక ఎండుముఖం పడుతున్నాయి.

వరి నారు వేస్తున్నాం



బోరు నీటి ఆధారంగా నారుమడులు సిద్ధం చేసుకుంటున్నాం. పూర్తిగా బోరు నీటి మీద ఆధారపడి వరి సాగు చేయాలంటే కష్టంగా ఉంటుంది. వర్షాలు పడి చెరువు నిండితే రైతులందరు వరి పంట సాగు చేసుకోవచ్చు.

– షేక్ ఖయ్యూమ్, రైతు

వర్షం కోసం ఎదురుచూపు



రాష్ట్రవ్యాప్తంగా వర్షాలు పడుతున్నా ఇక్కడ సరైన వాన కురవలేదు. వర్షాలు పడితే కంది, మిరప సాగు చేసుకోవచ్చు. ఖరీఫ్ సీజన్ దాటిపోతున్నా వర్షాలు కురవకపోవడంతో రైతులు ఆందోళన చెందుతున్నారు.

– మనుమాను రామిరెడ్డి, రైతు

అదును దాటిపోతోంది



కంది పంట సాగు చేసుకోడానికి అదును దాటిపోతోంది. ఇటీవల కురిసిన వర్షాలకు పూర్తి స్థాయిలో అదును దొరకలేదు. అదునుకు సరిపడా వర్షం కురిస్తే పంటలు సాగు చేసుకోవచ్చు.

– నెమలిదిన్నె రామిరెడ్డి, రైతు

కొంత మేర మెట్ట పైర్లు వేశారు



రైతులు కొంత వరకు కంది, సజ్జ, కొర్ర, పత్తి వంటి మెట్టపైర్లు సాగు చేశారు. కంభం, చిన్న కంభం, తురిమెళ్ల ప్రాంతాల్లో నారుమడులు సిద్ధం చేసుకుంటున్నారు. వర్షం పడితే పత్తి వేసుకోడానికి అనుకూలంగా ఉంటుంది.

– డి.స్వరూప, వ్యవసాయాధికారి, కంభం

వాటర్ షెడ్ బిల్లు.. ఖజానాకు చిల్లు!

అడ్డగోలుగా బిల్లులు పెట్టి నిధుల దోపిడీకి తెరలేపిన టీడీపీ నేతలు

- జిల్లాలో చేపట్టిన అన్ని పనులకు కాకర్ల నరసింహం పేరు మీదే నిధులు డ్రా
- కమిటీ సభ్యులకు తెలియకుండానే పనులు
- ఇదేంటని ప్రశ్నిస్తే అధికారం మాదంటూ బెదిరింపులు
- సైలెంట్ మోడ్‌లో డ్వామా అధికారులు

పీసీపల్లి:

టీడీపీ అధికారం చేపట్టిన వెంటనే ఆర్థికమూలాలను పరిపుష్టం చేసుకునే పనిలో ఆ పార్టీ నేతలు తలమునకలయ్యారు. గద్దెనెక్కిన 50 రోజుల్లోనే నిధుల దోపిడికి తెరలేపారు. వివరాల్లోకి వెళ్తే.. పీసీపల్లి మండల పరిధిలోని నేరేడుపల్లి, పీసీపల్లి, మురుగమ్మి, పోతవరం గ్రామాల్లో వాటర్ షెడ్ పనుల(కుంటల్లో పూడిక తీత, కుంటలు ఏర్పాటు చేయడం)కు రూ.3 కోట్ల మేర నిధులు మంజూరయ్యాయి. గ్రామాల్లో వాటర్ షెడ్ కమిటీలు ఏర్పాటు చేసి వారి ఆధ్వర్యంలో పనులు నిర్వహించాల్సి ఉంది. నేరేడుపల్లి గ్రామంలో పనులకు రూ.కోటి మంజూరు కాగా వైఎస్సార్ సీపీ హయాంలో వాటర్ షెడ్ కమిటీ చైర్మన్ బోరెడ్డి నరసింహారెడ్డి, కోటిరెడ్డి మరికొంత మంది సభ్యులతో కలిసి 42 శాతం పనులు చేపట్టారు. ఈ క్రమంలో సార్వత్రిక ఎన్నికల షెడ్యూల్ విడుదల కావడంతో పనులు నిలిచిపోయాయి. టీడీపీ అధికారంలోకి రావడంతో ఆ పార్టీ సానుభూతిపరుడైన సర్పంచ్ పల్లా మల్లికార్జున వాటర్ షెడ్ కమిటీకి సమాచారం లేకుండా పనులు చేపట్టి నిధుల స్వాహాకు తెరలేపారు. ఈ విషయమై సర్పంచ్‌ను వాటర్ షెడ్ కమిటీ సభ్యులు నిలదీయగా 'కమిటీలో ఎక్కువ మంది సభ్యులను చేరుస్తున్నాం. మార్పులు చేస్తున్నాం. అధికారంలో ఉంది మా పార్టీ' అంటూ బెదిరింపులకు దిగారు. అడ్డగోలు పనులపై ఉన్నతాధికారులను వివరణ కోరేందుకు ప్రయత్నించగా ఎవరూ స్పందించలేదు.



జేసీబీతో పనులు చేస్తున్న టీడీపీ నాయకులు

ఎవరీ కాకర్ల నరసింహం?

సాధారణంగా గ్రామాల్లో వాటర్ షెడ్ కమిటీ ఆధ్వర్యంలో చేపట్టిన పనులకు సంబంధించిన బిల్లులను ఆయా కమిటీల చైర్మన్ల అకౌంట్లలోనే జమ చేయాలి. కానీ జిల్లాలో వాటర్ షెడ్ కింద చేపడుతున్న అన్ని పనులకు సంబంధించి కోట్ల రూపాయల బిల్లులను కాకర్ల నరసింహం అనే కాంట్రాక్టర్ పేరు మీద డ్రా చేస్తుండటం గమనార్హం. గ్రామాలకు సంబంధించిన నిధులను నరసింహం అకౌంట్లో ఎందుకు జమ చేస్తున్నారో అర్థం కావడం లేదని కమిటీ సభ్యులు విస్తుపోతున్నారు.

నిధుల స్వాహాను అడ్డుకోవాలి



టీడీపీ అధికారంలోకి వచ్చాక దోపిడీకి తెరలేపారు. తూతూ మంత్రంగా పనులు నిర్వహిస్తూ నిధులు స్వాహా చేస్తున్నారు. వాటర్ షెడ్ కమిటీకి తెలియకుండా చేపడుతున్న పనులకు అధికారులు బిల్లులు చెల్లించడాన్ని ఆపాలి.

– బోరెడ్డి నరసింహారెడ్డి, వాటర్ షెడ్ కమిటీ చైర్మన్

వాటర్ షెడ్ కమిటీలకే నిధులు జమ చేయాలి



వాటర్ షెడ్ కమిటీల ఆధ్వర్యంలో నిర్వహించే పనులకు సంబంధించి కమిటీ అకౌంట్‌లోనే నిధులు జమ చేయాలి. కమిటీలతో సంబంధం లేని వ్యక్తికి నిధులు ఎందుకు జమ చేస్తున్నారనే దానిపై పూర్తి స్థాయిలో విచారణ చేపట్టి చర్యలు తీసుకోవాలి.

– కోటిరెడ్డి, వాటర్‌షెడ్ కమిటీ వైస్ చైర్మన్

సంక్షేమ పథకాలు అమలు చేయాలి

- మీడియాతో మార్కాపురం మాజీ ఎమ్మెల్యే కేపీ నాగార్జునరెడ్డి



కేపీ నాగార్జునరెడ్డి

మార్కాపురం: కేంద్రం పూర్తిస్థాయిలో బడ్జెట్ ప్రవేశపెడితే.. మన రాష్ట్రంలో ఓట్ ఆన్ అకౌంట్ బడ్జెట్ ప్రవేశపెట్టడంలో ఆంతర్యం ఏమిటో అర్థం కావడం లేదని మార్కాపురం మాజీ ఎమ్మెల్యే, వైఎస్సార్ సీపీ గిద్దలూరు నియోజకవర్గ ఇన్‌చార్జి కేపీ నాగార్జునరెడ్డి అన్నారు. సోమవారం రాత్రి మీడియాతో ఆయన మాట్లాడారు. 2019లో ఆనాటి ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అసెంబ్లీలో పూర్తిస్థాయిలో బడ్జెట్ ప్రవేశపెట్టి సంక్షేమ పథకాలు అమలు చేశారని తెలిపారు. కానీ, నేడు చంద్రబాబు ప్రభుత్వం ఓట్ ఆన్ అకౌంట్ బడ్జెట్ ప్రవేశపెట్టడంలో ఆంతర్యం అర్థం కావడం లేదన్నారు. ఎన్నికల్లో ఇచ్చిన హామీలన్నింటినీ నెరవేర్చాలని, సంక్షేమ పథకాలు అమలు చేయాలని చంద్రబాబు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ప్రస్తుత ప్రభుత్వం గత ఎన్నికల్లో ప్రజలకు అమలుచేయలేని హామీలిచ్చి.. ఇప్పుడు అసెంబ్లీలో ఓట్ ఆన్ అకౌంట్ బడ్జెట్ పెట్టిందని విమర్శించారు. 2019 ఎన్నికల తర్వాత ఏర్పడిన వైఎస్సార్ సీపీ ప్రభుత్వం మొదటి బడ్జెట్ ప్రవేశపెట్టేందుకు ఎంత సమయం ఉందో.. ఇప్పుడు కూడా కూటమి ప్రభుత్వానికి అంతే సమయం ఉందన్నారు. అప్పుడు పూర్తి బడ్జెట్ ప్రవేశపెట్టగా, ఇప్పుడెందుకు పెట్టడం లేదని ప్రశ్నించారు. సంక్షేమ పథకాలు అమలు చేయకుండా దాటవేసేందుకే ఈ బడ్జెట్ పెట్టినట్లు ఉందన్నారు.

50 రోజుల్లోనే అనేక అరాచకాలు...

కూటమి ప్రభుత్వ పాలనలో 50 రోజుల్లోనే ఎన్నో అరాచకాలు, దాడులు జరిగాయని, అమాయకులైన వైఎస్సార్ సీపీ కార్యకర్తలు బలైపోతున్నారని కేపీ నాగార్జునరెడ్డి ఆందోళన వ్యక్తం చేశారు. రాష్ట్రంలో జరుగుతున్న అరాచక పాలనపై వైఎస్సార్ సీపీ అధినేత వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఢిల్లీలో ధర్నా చేసి దేశ నాయకులు, ప్రజలకు సమస్యను వివరించారని తెలిపారు. ఈ ధర్నాకు వివిధ రాష్ట్రాల నుంచి వివిధ పార్టీల నాయకులు వచ్చి మద్దతు తెలిపి పరిస్థితిని తెలుసుకున్నారన్నారు. ఇక్కడ జరుగుతున్న దాడులను వారంతా ఖండించారని తెలిపారు. రాష్ట్ర ప్రజలు కూడా 50 రోజుల పాలన ఎంత దారుణంగా ఉందో గమనిస్తున్నారన్నారు. ఇటువంటి పాలనను తాము ఖండిస్తున్నామని, ప్రజలకు ఇచ్చిన హామీలను కచ్చితంగా అమలుచేసేందుకు పూర్తిస్థాయి బడ్జెట్ ప్రవేశపెట్టాలని కేపీ నాగార్జునరెడ్డి డిమాండ్ చేశారు.

చెవిరెడ్డి మోహిత్‌రెడ్డి అరెస్టు అక్రమం...

వైఎస్సార్ సీపీ చంద్రగిరి ఎమ్మెల్యే అభ్యర్థిగా పోటీ చేసిన చెవిరెడ్డి మోహిత్‌రెడ్డి అరెస్టు అక్రమమని కేపీ నాగార్జునరెడ్డి అన్నారు. అక్కడ ఎమ్మెల్యే ఆరోపిస్తున్నట్లుగా ఆయనపై జరిగిన దాడిలో మోహిత్‌రెడ్డి లేరన్నారు. దాడి జరిగే సమయంలో మోహిత్‌రెడ్డి కలెక్టర్, జాయింట్ కలెక్టర్ల సమక్షంలో ఎన్నికల ప్రక్రియలో ఉన్నారని, వీడియో ఫుటేజీ కూడా ఉందని తెలిపారు. అయినప్పటికీ చెవిరెడ్డి మోహిత్‌రెడ్డిని అరెస్టు చేయడం దారుణమని, ప్రజాస్వామ్యంలో ఇలాంటివి మంచిది కాదని కేపీ నాగార్జునరెడ్డి అన్నారు.

రోడ్డు ప్రమాదంలో ఇంటర్ విద్యార్థి మృతి

చీమకుర్తి: రోడ్డు ప్రమాదంలో ఇంటర్ విద్యార్థి మృతిచెందగా, అతని తల్లి, పెద్దమ్మకు తీవ్రగాయాలయ్యాయి. ఒంగోలు-కర్నూలు రోడ్డుపై చీమకుర్తి-సంతనూతలపాడు మధ్య ఉన్న టపా చెట్టు వద్ద సోమవారం ఈ ప్రమాదం జరిగింది. సంతనూతలపాడు మండలం గుడిపాడుకు చెందిన చిడిపూడి రాకేష్‌రెడ్డి (19) తన బైకుపై తల్లి శ్రీదేవి, పెద్దమ్మ వెంకటలక్ష్మిని ఎక్కించుకుని చీమకుర్తి మండలం బండ్లమూడి వెళ్లాడు. అక్కడి నుంచి తిరిగి ఇంటికి వస్తున్న సమయంలో ఒంగోలు నుంచి చీమకుర్తి వైపు వెళ్తున్న మినీ వాహనం ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో రాకేష్‌రెడ్డి తీవ్రంగా గాయపడగా, ఒంగోలులోని ఆస్పత్రికి తీసుకెళ్లారు. అతను మార్గం మధ్యలోనే మృతిచెందినట్లు డాక్టర్ ధ్రువీకరించారు. రాకేష్‌రెడ్డి ఇంటర్ పూర్తి చేసి ఇంజినీరింగ్ చదివేందుకు కొద్ది రోజుల్లో గుజరాత్ వెళ్లాల్సి ఉందని బంధువులు తెలిపారు. అతని తల్లి శ్రీదేవి, పెద్దమ్మ వెంకటలక్ష్మికి కూడా గాయాలవడంతో ఆస్పత్రిలో చేర్పించారు. విషయం తెలుసుకున్న కుటుంబ సభ్యులు, బంధువులు భోరున విలపించారు. వారి ఫిర్యాదు మేరకు సంతనూతలపాడు హెడ్‌కానిస్టేబుల్ సీహెచ్ భాస్కర్‌రావు కేసు నమోదు చేసి విచారణ చేపట్టారు.

పోలీసుల అదుపులో గంజాయి బ్యాచ్!

సింగరాయకొండ: పోలీసుల అదుపులో గంజాయి ముఠాకు చెందిన ఆరుగురు యువకులు ఉన్న సంఘటన ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. విశ్వసనీయ సమాచారం ప్రకారం ఈనెల 28 వతేదీ తెల్లవారుజామున సుమారు 3.30 గంటల సమయంలో పోలీసులు గస్తీ నిర్వహిస్తూ జాతీయరహదారిపై కనుమళ్ల జంక్షన్ సమీపంలోని విమానాల రన్‌వే సమీపంలో హోటళ్ల వద్దకు వెళ్లారు. ఆ సమయంలో ఒంగోలు వైపు నుంచి మోటారుసైకిల్‌పై ముగ్గురు కుర్రాళ్లు సిగిరెట్ తాగేందుకు హోటల్ వద్ద ఆగారు. దీంతో అనుమానాస్పదంగా ఉన్న వీరిని పోలీసులు తనిఖీ చేయగా వారి వద్ద సుమారు 6 కేజీల గంజాయి దొరికింది. దీంతో వీరు సమాచారాన్ని సీఐ దాచేపల్లి రంగనాథ్‌కు తెలపటంతో అప్రమత్తమైన సీఐ అదుపులోకి తీసుకున్న ఆ ముగ్గురు కుర్రాళ్లను విచారించగా నెల్లూరు జిల్లా ఆత్మకూరులో ఇచ్చిరమ్మని ఒంగోలులో యువకులు సరుకు ఇచ్చారని చెప్పారు. విచారణలో నిందితులు ఇచ్చిన సమాచారంతో ఒంగోలులో ఉన్న మరో ముగ్గురు యువకులను పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. ఈ గంజాయి మాఫియా ప్రధాన సూత్రధారి చెన్నైలో ఉంటాడని తేలడంతో పోలీసులు ప్రత్యేకంగా బృందాలుగా ఏర్పడి గాలింపు చర్యలు చేపట్టినట్లు సమాచారం.

రోడ్డు ప్రమాదంలో గుర్తు తెలియని వ్యక్తి మృతి



రహదారిపై గుర్తు తెలియని మృతదేహం

టంగుటూరు: గుర్తు తెలియని వాహనం ఢీకొని గుర్తు తెలియని వ్యక్తి మృతి చెందిన సంఘటన టంగుటూరు మండలంలోని వల్లూరు-సూరారెడ్డిపాలెం మధ్య జాతీయ రహదారిపై ఆదివారం చోటుచేసుకుంది. పోలీసుల కథనం ప్రకారం.. తెల్లచొక్కా, సిమెంటు రంగు ఫ్యాంటు ధరించి ఉన్న వ్యక్తిని వల్లూరు – సూరారెడ్డిపాలెం జాతీయ రహదారిపై గుర్తు తెలియని వాహనం ఢీకొని సుమారు 50 ఏళ్ల వ్యక్తి మృతి చెందాడు. స్థానికులు 108 అంబులెన్స్‌కు సమాచారం ఇవ్వగా జీజీహెచ్‌కు తరలించారు. జీజీహెచ్ నుంచి అందిన సమాచారంతో సోమవారం కేసు నమోదు చేసినట్లు ఎస్సై పున్నారావు తెలిపారు. మృతుడి వివరాలు తెలిసిన వారు 9121102137ను సంప్రదించాలని కోరారు.

నైపుణ్యాన్ని పెంపొందించుకోవాలి

- విద్యార్థులకు సబ్‌కలెక్టర్ రాహుల్ మీనా సూచన
- నవోదయలో విజ్ఞాన ప్రదర్శన ప్రారంభం

తర్లుపాడు: విద్యార్థులు విద్యతోపాటు నైపుణ్యాన్ని పెంపొందించుకుని ప్రయోగాత్మక అధ్యయనం చేయడం అలవాటు చేసుకోవాలని సబ్‌కలెక్టర్ రాహుల్‌మీనా సూచించారు. సోమవారం తర్లుపాడు మండలంలోని కలుజువ్వలపాడు పీఎంశ్రీ జవహర్ నవోదయ విద్యాలయంలో క్లస్టర్ స్థాయి విజ్ఞాన ప్రదర్శనను సబ్ కలెక్టర్ ప్రారంభించారు. విజ్ఞాన శాస్త్రం, గణితం, పర్యావరణం, పరిసరాల విజ్ఞానానికి సంబంధించిన ఫొటోలను విద్యార్థులు ప్రదర్శించారు. ఈ సందర్భంగా సబ్‌కలెక్టర్ మాట్లాడుతూ.. కేంద్ర ప్రభుత్వం తయారుచేసిన ఎన్‌సీఎఫ్, ఎన్‌ఈపీలో పేర్కొన్నట్లుగా 21వ శతాబ్దంలో నైపుణ్యాల పెంపునకు ఈ కార్యక్రమాలు దోహదపడతాయని ప్రశంసించారు. విద్యార్థులు భవిష్యత్తులో దేశం గర్వించదగిన పౌరులుగా ఎదగాలని, అందుకు తగిన శక్తి యుక్తులను సముపార్జించుకోవాలని సూచించారు. నవోదయ విద్యాలయ ప్రిన్సిపాల్ గణేష్‌కుమార్ మాట్లాడుతూ.. విద్యార్థులు కృషి పట్టుదలతో జీవితంలో ఉన్నత స్థాయికి ఎదగాలని ఆకాంక్షించారు. ప్రదర్శనకు నవోదయ విద్యాలయ సమితి నుంచి పుదుచ్చేరి రాష్ట్రంతోపాటు అనంతపురం, చిత్తూరు, కడప, కర్నూల్, కర్నూల్, నెల్లూరు, ప్రకాశం 1, ప్రకాశం-2 నుంచి తొమ్మిది విద్యాలయాల విద్యార్థులు హాజరయ్యారు. కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ పీఆర్ శంకరి రాయవరం గురుకుల పాఠశాల ప్రిన్సిపాల్ ఆశాలత, పీజీటీ వెంకటరమణ, ఉపాధ్యాయులు, పాఠశాల సిబ్బంది పాల్గొన్నారు.



విజ్ఞాన ప్రదర్శన స్టాల్‌ను పరిశీలిస్తున్న రాహుల్‌మీనా, ప్రిన్సిపాల్

పోలీస్ ఫిర్యాదుల వేదికకు 81 అర్జీలు

ఒంగోలు టౌన్: ప్రజా సమస్యల పరిష్కార వేదికలో తెలియజేసిన సమస్యను సత్వరమే పరిష్కరించేందుకు తగిన చర్యలు తీసుకుంటున్నట్లు అడిషనల్ ఎస్పీ(అడ్మిన్) కె.నాగేశ్వరరావు, అడిషనల్ ఎస్పీ(క్రైం) ఎస్‌వీ శ్రీధర్‌రావు పేర్కొన్నారు. సోమవారం జిల్లా పోలీసు కార్యాలయంలో నిర్వహించిన ప్రజా సమస్యల పరిష్కార వేదికలో 81 మంది అర్జీలు అందజేసి గోడు వెళ్లబోసుకున్నారు. కుటుంబ కలహాలు, అత్తారింటి వేధింపులు, ఉద్యోగాల పేరుతో మోసాలు, భూవివాదాలకు సంబంధించిన సమస్యలపై అధికారులకు రాత పూర్వకంగా ఫిర్యాదులు అందించారు. ఏఎస్పీలు మాట్లాడుతూ.. ఫిర్యాదులపై చట్టప్రకారం విచారించి సత్వర పరిష్కారానికి తగిన చర్యలు తీసుకుంటామని అర్జీదారులకు భరోసా ఇచ్చారు. పోలీసు అధికారులతో ఫోన్‌లో మాట్లాడి బాధితులకు న్యాయం చేయాలని ఆదేశించారు. కార్యక్రమంలో ఒంగోలు డీఎస్పీ కిశోర్ బాబు, తాలుకా ఇన్‌చార్జి సీఐ షేక్ ఖాజావలి, ఐసీసీఆర్ ఇన్‌స్పెక్టర్ వెంకటేశ్వరరావు, ప్యానల్ అడ్వకేట్ బీవీ శివరామకృష్ణ, ఎస్సైలు పాల్గొన్నారు.



ఫిర్యాదుదారులతో మాట్లాడుతున్న ఏఎస్పీ(క్రైం) శ్రీధర్‌రావు

క్లుప్తంగా

నేటి నుంచి విద్యుత్ సరఫరాకు అంతరాయం

యర్రగొండపాలెం: త్రిపురాంతకం మండలం కేసినేనిపల్లి విద్యుత్ సబ్‌స్టేషన్, పెద్దదోర్నాలలోని 132 కేవీ విద్యుత్ సబ్‌స్టేషన్‌లో మంగళవారం నుంచి ఆగస్టు 1వ తేదీ వరకు మరమ్మతులు చేపడుతున్నామని ఆ శాఖ మార్కాపురం ఈఈ కె.నాగేశ్వరరావు సోమవారం తెలిపారు. మరమ్మతుల కారణంగా నియోజకవర్గ పరిధిలోని పుల్లలచెరువు, త్రిపురాంతకం, పెద్దదోర్నాల, పెద్దారవీడు, యర్రగొండపాలెం మండలాల్లో ఏ సమయంలోనైనా విద్యుత్‌లో అంతరాయం కలుగుతుందని, వినియోగదారులకు ఎటువంటి అసౌకర్యం కలగకుండా తగిన ఏర్పాట్లు చేశామని చెప్పారు. ఆయా ప్రాంతాల్లో విద్యుత్‌లో అంతరాయం కలిగితే మరమ్మతుల కారణంగా జరిగిందని వినియోగదారులు గుర్తించి విద్యుత్ శాఖాధికారులతో సహకరించాలని ఆయన కోరారు.

చేపల చెరువు నిర్మాణాలు నిలిపి వేయాలి

ముండ్లమూరు: మండలంలోని పసుపుగల్లు సమీపంలో నడంపల్లి కండ్రిక వద్ద అక్రమంగా ఏర్పాటు చేస్తున్న చేపల చెరువుల నిర్మాణాలను నిలిపివేయాలని కోరుతూ సోమవారం ఇన్‌చార్జి తహసీల్దార్ పుల్లారెడ్డికి పలువురు రైతులు వినతిపత్రం అందజేశారు. సర్వే నంబరు 77లో అనధికారికంగా కొందరు చేపల చెరువుల కోసం తవ్వకాలు చేపట్టినందున వాటిని నిలిపి వేసేలా చర్యలు తీసుకోవాలని చుట్టుపక్కల రైతులు ధనలక్ష్మి, ధర్మవరపు శ్రీనివాసరావు, నరసింహం తదితరులు వినతి పత్రం అందజేశారు. ఆ ప్రాంతంలో చేపల చెరువు ఏర్పాటు చేస్తే తమ పొలాల్లో పంట నష్టం జరుగుతోందన్నారు. చేపల చెరువుల వ్యర్థాల కోసం పక్షులు వచ్చి పంటను నాశనం చేస్తాయన్నారు. సంబంధిత అధికారులు వెంటనే చేపల చెరువుల నిర్మాణాలను నిలిపివేసేందుకు చర్యలు తీసుకోవాలని కోరారు.

చికిత్స పొందుతూ క్షతగాత్రుడు మృతి


ఖాజావలి (ఫైల్)

ముండ్లమూరు: మండలంలోని పోలవరం వద్ద ఆదివారం జరిగిన రోడ్డు ప్రమాదంలో గాయపడిన ఎస్‌కే ఖాజావలి (62) గుంటూరు ప్రైవేట్ వైద్యశాలలో చికిత్స పొందుతూ సోమవారం మృతి చెందినట్లు పోలీసులు తెలిపారు. ప్రమాదంలో తీవ్ర గాయలైన ఖాజావలిని ఆదివారం ఒంగోలుకి తరలించగా పరిస్థితి విషమించడంతో అదే రోజు రాత్రి గుంటూరుకు తీసుకెళ్లారు. అక్కడ చికిత్స పొందుతూ మృతి చెందడంతో పోస్టుమార్టం అనంతరం మృతదేహాన్ని ముండ్లమూరుకు తీసుకొచ్చారు. మృతునికి భార్య, కుమారుడు, కుమార్తె ఉన్నారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ నాగమల్లేశ్వరరావు తెలిపారు.

ఇసుక కొరతను నివారించండి


సబ్‌కలెక్టర్‌కు వినతిపత్రం ఇస్తున్న బీజేపీ నాయకులు

మార్కాపురం టౌన్: రాష్ట్రంలో ఇసుక కొరత తీవ్రంగా ఉండటంతో భవన నిర్మాణ కార్మికులు పనులు లేక ఇబ్బంది పడుతున్నారని, తక్షణమే ఇసుక కొరతను నివారించాలని సబ్‌కలెక్టర్ రాహుల్‌మీనాకు బీజేపీ ఇన్‌చార్జి పీవీ కృష్ణారావు వినతిపత్రం ఇచ్చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రాష్ట్ర వ్యాప్తంగా ఇసుక సమస్య ఏర్పడటంతో భవన నిర్మాణ కార్మికులు పనులులేక అవస్థలు పడుతున్నారన్నారు. ఎన్‌డీఏ ప్రభుత్వం ఉచిత ఇసుక ఇస్తున్నట్లు ప్రకటించినా సరైన సమయానికి ఇసుక అందుబాటులో లేకపోవడంతో గృహ నిర్మాణాలు ముందుకు సాగడం లేదని, దీంతో పనులు లేక కార్మికులు పస్తులుంటున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి తగిన చర్యలు తీసుకోవాలని కోరారు. కార్యక్రమంలో మీడియా ఇన్‌చార్జి రామకృష్ణ, బీజేపీ కార్మిక సంఘం నాయకులు వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

కుష్టువ్యాధి నిర్మూలనకు కృషి చేయాలి

● డిప్యూటీ డీఎంహెచ్‌ఓ మాధవీలత


సిబ్బందితో మాట్లాడుతున్న డిప్యూటీ డీఎంహెచ్‌ఓ మాధవీలత

తాళ్లూరు (ముండ్లమూరు): కుష్టువ్యాధి నిర్మూలకు ఆరోగ్య సిబ్బంది కృషి చేయాలని డిప్యూటీ డీఎం అండ్‌హెచ్‌ఓ మాధవీలత తెలిపారు. స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో సోమవారం సిబ్బందితో ఆమె సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ మండలంలో ఇంటింటా సర్వే ద్వారా కుష్టువ్యాధి లక్షణాలు ఉన్న వారిని గుర్తించాలన్నారు. ప్రతి వ్యక్తిని కలిసి అనుమానపు మచ్చలు ఒంటిపై ఉంటే వారికి సర్వే ప్రాధాన్యతను వివరించాలన్నారు. రాగి మచ్చలు ఉన్న 30 మంది అనుమానితులను గుర్తించినట్లు అధికారులు ఆమె దృష్టికి తీసుకెళ్లారు. అనంతరం సిబ్బందికి కేటాయించిన లక్ష్యాలను సాధించడంలో వారి ప్రగతిపై రివ్యూ చేశారు. వర్షాల సమయంలో ఎలాంటి సీజనల్ వ్యాధులు ప్రబలకుండా తీసుకోవాల్సిన ముందస్తు చర్యలపై అవగాహన కల్పించారు. గ్రామాల్లో పారిశుధ్య పనులు చేసేందుకు పంచాయతీ సిబ్బందిని సమన్వయం చేసుకోవాలన్నారు. అనుమానితులతో అప్రమత్తంగా ఉండి వారికి అవసరమైన సలహాలు, సూచనలు చేస్తూ నివారణ చర్యలు తీసుకోవాలన్నారు. డీఎస్‌ఎంఓ శ్రీవాణి, వైద్యాధికారులు ఖాదర్ మస్తాన్‌బీ, రాజేష్, ఏఎన్‌ఎంలు, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

మధ్యాహ్న భోజనం రుచి చూడండి


విద్యార్థులకు భోజనం వడ్డిస్తున్న దాతలు, గ్రామస్తులు

యర్రగొండపాలెం: గ్రామస్తులు పాఠశాలలకు వెళ్లి మధ్యాహ్నం భోజనం రుచి చూస్తే విద్యావ్యవస్థపై వారికి మంచి అవగాహన, నమ్మకం ఏర్పడుతుందని ఎంఈవోలు పి.ఆంజనేయులు, మల్లునాయక్‌లు అన్నారు. సోమవారం శిక్షా సప్తాహ చివరి రోజు సామాజిక భాగస్వామ్య దినోత్సవాన్ని పురస్కరించుకొని విందు భోజనంతో విద్యావారోత్సవాలు ముగించారు. ఈ సందర్భంగా మండలంలోని అన్ని ప్రభుత్వ పాఠశాలల్లో గ్రామస్తులతో తిథి భోజన్ కార్యక్రమాన్ని చేపట్టారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మండలంలోని 55 పాఠశాలల్లో దాతలు ముందుకొచ్చి రుచికరమైన భోజనం, పాయసం, పెరుగు, చికెన్ పులావు, అరటిపండ్లు, స్వీట్లు విద్యార్థులకు వడ్డించడం శుభపరిణామమన్నారు. ఆయా పాఠశాలల్లో విందు భోజనం ఏర్పాటు చేసిన దాతలు గోళ్ల వీరవెంకట సుబ్బారావు, మెడబలిమి అచ్యుతరావు, ఎంపీటీసీ సభ్యుడు పసుపులేటి వెంకట సుబ్బారావు, హెచ్‌ఎం వెంకటరెడ్డి, వంటలక్క సీహెచ్ అల్లూరమ్మలను ఎంఈవోలు, హెచ్‌ఎంలు, ఉపాధ్యాయులు ఘనంగా సన్మానించారు.

ఎరువుల దుకాణాల తనిఖీ

కొమరోలు: మండలంలోని పలు ఎరువుల దుకాణాలను వ్యవసాయశాఖ అధికారులు సోమవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. కనిగిరి సహాయ వ్యవసాయ సంచాలకుడు ఈ వెంకటరమణ, వ్యవసాయశాఖ అధికారి రాజశ్రీ సోమవారం పలు దుకాణాలను తనిఖీ చేసి స్టాక్ రిజిష్టర్లు, బిల్ బుక్‌లు, రశీదులు, ప్రిన్సిపల్ సర్టిఫికెట్లను పరిశీలించారు. అనంతరం విత్తనాలు, ఎరువుల విక్రయ దారులకు పలు సూచనలు చేశారు. ఈ సందర్భంగా సహాయ వ్యవసాయ సంచాలకులు వెంకటరమణ మాట్లాడుతూ విత్తనాలు విక్రయించిన వెంటనే తప్పనిసరిగా బిల్లులు ఇవ్వాలన్నారు. విత్తనాల స్టాక్ వచ్చినపుడు వ్యవసాయాధికారికి సమాచారం ఎప్పటికప్పుడు ఇవ్వాలన్నారు. స్టాక్ వచ్చినపుడు మొలక శాతం కట్టి తరువాత రైతులకు విక్రయించాలని, గడువు ముగిసిన స్టాక్‌ను ఎప్పటికప్పుడు వేరు చేసి ఉంచాలని తెలిపారు.

పచ్చదోమ నివారణ చర్యలు

అర్థవీడు(బేస్తవారిపేట): పత్తి పంటలో పచ్చదోమ, తామర పురుగు నివారణకు ఎసిఫేట్ 1.5 గ్రాములు, లేక ఇమిడాక్లోఫిడ్ 0.2 ఎంఎల్ లీటరు నీటికి కలిపి పిచికారీ చేయాలని వ్యవసాయాధికారి షేక్ మొహమ్మద్ అన్నారు. మండలంలోని పాపినేనిపల్లె, దొనకొండ గ్రామాల్లో పత్తి, ఆముదం పంటలను సోమవారం పరిశీలించారు. ఆముదం పంటలో పొగాకు లద్దె పురుగు నివారణకు వేపనూనె 5 ఎంఎల్, లేక క్లోరిఫైరిఫాస్ 2.5 ఎంఎల్ లేదా, ఎసిఫేట్ 0.5 గ్రాములు లీటర్ నీటికి కలిపి పిచికారీ చేయాలని సూచించారు. పసుపురంగు జిగురు అట్టలు ఎకరానికి 20 పొలంలో పెట్టుకోవడంతో తెల్లదోమను నివారించవచ్చని తెలిపారు. ఏఈఓ శివగంగ ప్రసాద్, వీఏఏ ఇమ్రాన్‌ఖాన్, రవికాంత్ పాల్గొన్నారు.

విద్యార్థులకు అర్థమయ్యేలా బోధించాలి

● జీసీడీఓ మాధవీలత

కొనకనమిట్ల: మండలంలోని గొట్లగట్టు కస్తూర్బా గాంధీ బాలికల పాఠశాలను జీసీడీఓ మాధవీలత సోమవారం సందర్శించారు. పాఠశాల తరగతి గదులు, వంటశాలను పరిశీలించి బాలికలతో మాట్లాడారు. విద్యా బోధన, వసతుల పరంగా ఏమైనా ఇబ్బందులు ఉన్నాయా అడిగి తెలుసుకున్నారు. ఉపాధ్యాయలతో మాట్లాడుతూ.. విద్యార్థులకు అర్థమయ్యే రీతిలో పాఠాలు బోధించాలని సూచించారు. మధ్యాహ్న భోజనాన్ని పరిశీలించి కుకింగ్ ఏజెన్సీ నిర్వాహకులకు సూచనలిచ్చారు. ఇంటర్మీడియెట్ అధ్యాపకులతో సమీక్ష నిర్వహించారు. తనిఖీ సమయంలో ప్రిన్సిపాల్ రాఘవ సురేఖ, ఉపాధ్యాయులు ఉన్నారు.

కుక్కల పట్టివేత ప్రారంభం

సాక్షి ఎఫెక్ట్..

కంభం: కుక్కల బెడద నివారణకు పంచాయతీ అధికారులు చర్యలు చేపట్టారు. పట్టణంలో కుక్కల బెడద అధికంగా ఉన్న నేపథ్యంలో సాక్షి దినపత్రికలో ఈనెల 26వ తేదీన 'బాబోయ్ భౌ.. భౌ' అన్న శీర్షికతో వచ్చిన కథనానికి స్పందించిన పంచాయతీ అధికారులు చర్యలు ప్రారంభించారు. కంభం, కందులాపురం , హజరత్ గూడెం పంచాయతీ లు మూడు పట్టణంలో కలసి ఉండటంతో ముగ్గురు సర్పంచులు, కార్యదర్శులు సమన్వయమై సోమవారం నుంచి కుక్కలను పట్టించే కార్యక్రమం మొదలు పెట్టారు. కుక్కలను పట్టుకొని దిగువమెట్ట అటవీ ప్రాంతంలో వదిలేయనున్నట్లు పంచాయతీ అధికారులు తెలిపారు.

ఉద్యోగికి పదవీ విరమణ తప్పనిసరి


పదవీ విరమణ పొందిన ఉపాధ్యాయులను సన్మానిస్తున్న ఎంఈఓలు, ఉపాధ్యాయులు

పెద్దారవీడు: ప్రభుత్వ ఉద్యోగికి పదవీ విరమణ తప్పనిసరి అని ఎంఈఓ-1 పి.శ్రీనివాసులు, ఎంఈఓ-2 సుబ్రహ్మణ్యం పేర్కొన్నారు. స్థానిక మండల విద్యాశాఖ కార్యాలయంలో గొబ్బూరు, సుంకేసుల ఎంపీపీ పాఠశాలల ఉపాధ్యాయులు గోసు సుబ్బారావు, వినోద్‌శాస్త్రి, సుంకేసుల ఎంపీయూపీ పాఠశాల హెచ్‌ఎం టీపీ వెంకటేశ్వర్లు ఈ నెల 31వ తేదీ పదవీ విరమణ కార్యక్రమాన్ని సోమవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఎందరో విద్యార్థుల భవిష్యత్తును తీర్చిదిద్దడమే కాకుండా అంకిత భావంతో పని చేసి సమాజసేవలో పాలుపంచుకున్నారని, వీరి సేవలు చిరస్మరణీయమైనవని వారిని ఆదర్శంగా తీసుకొని మండల ఉపాధ్యాయులు పని చేయాలని కొనియాడారు. పదవీ విరమణ చేయబోవు ఉపాధ్యాయులను ఎంఈఓలు, ఉపాధ్యాయులు శాలువాలు, పూలమాలతో సన్మానించారు. కార్యక్రమంలో సీఆర్పీలు వీరాంజనేయులు, మస్తానయ్య, వీరయ్య, హెచ్‌ఎంలు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

నాణ్యమైన మొక్కలనే రైతులకు అందజేయాలి

కంభం: నర్సరీల నుంచి నాణ్యత కలిగిన మొక్కలను మాత్రమే రైతులకు సరఫరా చేయాలని ఉద్యానవన శాఖ అధికారి డి.శ్వేత అన్నారు. కందులాపురం పరిధిలో ఉన్న ఉద్యానవన నర్సరీలో సోమవారం ఆమె తనిఖీ చేశారు. తెగులు, చీడలు లేని నాణ్యత కలిగిన ఆరోగ్యకరమైన మొక్కలను ఉత్పత్తి చేయడం నర్సరీ చట్టం ముఖ్య ఉద్దేశమన్నారు. కోకో పిట్ ట్రేలు నింపేముందు కిలో వేప పిండి, కిలో ట్రైకోడెర్మా విరిడి 300 కిలోల కోకో పిట్‌లో కలుపుకోవాలని, ట్రేలు భూమిని తాకకుండా ఉండటం కోసం ముందుగా బెడ్లపై ఒక ప్లాస్టిక్ షీట్‌ను పరిచి దానిపై ట్రేలను అమర్చాలని నర్సరీ యజమానులకు సూచించారు. అవసరాన్ని బట్టి మూడు గ్రాముల సూక్ష్మ పోషక మిశ్రమాన్ని ఒక లీటరు నీటికి కలిపి పిచికారీ చేయాలన్నారు. నారును ప్రధాన పొలంలో నాటే వారం ముందు నుంచి క్రమేపి నీటి తడవడం తగ్గించడం ద్వారా మొక్కలను ధృఢపరుచుకోవచ్చని తెలిపారు. రిజి స్ట్రేషన్ లేని నర్సరీలకు నోటీసులు ఇచ్చినట్లు తెలిపారు. కార్యక్రమంలో ఉద్యానవన విస్తరణ అధికారి శేషగిరి పాల్గొన్నారు.

ఘనంగా సామాజిక భాగస్వామ్య దినోత్సవం


గాయకులను సన్మానిస్తున్న ఉపాధ్యాయులు

కంభం: శిక్షా సప్తాహ్ కార్యక్రమంలో భాగంగా 7వ రోజు స్థానిక పార్కువీధిలోని ప్రభుత్వ పాఠశాలలో సామాజిక భాగస్వామ్య దినోత్సవాన్ని పండుగ వాతావరణంలో నిర్వహించారు. పాఠశాలలో ఏర్పాటు చేసిన గాన కచేరిలో న్యూలైట్ ఎడ్యుకేషన్ సొసైటీ ఫర్ డిజేబుల్డ్ సంస్థకు చెందిన కృష్ణవేణి, నాగరాజు పాడిన పాటలు అందరినీ ఆలోచింప చేశాయి. దాత, ప్రధానోపాధ్యాయుడు రసూల్ బేగ్ ఆయన మనవరాలి జన్మదినం సందర్భంగా భోజన ఏర్పాట్లు చేయగా, ఉపాధ్యాయుడు గోపిశెట్టి శ్రీనివాసులు స్వీట్లు పంపిణీ చేశారు. ఇతర ఉపాధ్యాయులు పండ్లు, మజ్జిగ పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఎంఈఓ కె. శర్వాణి, ప్రధానోపాధ్యాయుడు రసూల్‌బేగ్, బాల లింగయ్య, సీఆర్పీ మురళి, ఎంఐఎస్ కో ఆర్డినేటర్ చిన్ని పద్మావతి, పీఏసీ సభ్యులు పాల్గొన్నారు.


నాసరయ్యకు నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యే బూచేపల్లి శివప్రసాద్‌రెడ్డి

ఎమ్మెల్యే బూచేపల్లి దాతృత్వం


బాధితులకు ఆర్థిక సాయం అందిస్తున్న బూచేపల్లి

దర్శి: ఇటీవల పొలంలో మోటారు స్విచ్ వేసే తరుణంలో విద్యుత్ షాక్‌తో మృతి చెందిన రైతు, వైఎస్సార్ సీపీ కార్యకర్త కుటుంబానికి రూ.50 వేల ఆర్థిక సాయం అందించి దర్శి ఎమ్మెల్యే డాక్టర్ బూచేపల్లి శివప్రసాద్‌రెడ్డి తన దాతృత్వాన్ని చాటుకున్నారు. సోమవారం అబ్బాయిపాలెంలో వారి నివాసానికి వెళ్లి కుటుంబాన్ని పరామర్శించారు. రైతు నాసరయ్య చిత్రపటానికి నివాళులర్పించారు. మృతికి కారణాలు అడిగి తెలుసుకున్నారు. వారి కుటుంబానికి అండగా ఉంటామని భరోసా ఇచ్చారు.

అదే గ్రామంలో అనారోగ్యంతో బాధపడుతున్న పార్టీ కార్యకర్త ఇల్లూరి కోటిరెడ్డిని పరామర్శించారు. ఎన్నికల సమయంలో ఓట్లు కోసం పరామర్శించే రాజకీయ నాయకులకు అతీతంగా ఎన్నికలైన తర్వాత జరిగిన ఘటనల్లో కూడా బూచేపల్లి శివప్రసాద్‌రెడ్డి నిస్వార్థంతో వారి నివాసానికి వెళ్లి పరామర్శించడంపై ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారు. బూచేపల్లి నిస్వార్థపరుడని, ఆయన దాతృత్వానికి గ్రామస్తులు ధన్యవాదాలు తెలిపారు.

కౌలు రైతులకు బ్యాంకు రుణాలు


వినతిపత్రం అందజేస్తున్న ఏఓ, రైతులు

తాళ్లూరు (ముండ్లమూరు): మండలంలో అర్హత ఉన్న కౌలు రైతులందరికీ బ్యాంకు రుణాలు ఇచ్చేందుకు సిద్ధంగా ఉన్నామని కెనరా బ్యాంకు తాళ్లూరు బ్రాంచి మేనేజర్ ధర్మసాయి తెలిపారు. మండల వ్యవసాయాధికారి బి.ప్రసాదరావు కౌలు రైతులతో కలిసి సోమవారం బ్యాంకు మేనేజర్‌ను కలిసి వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా మేనేజర్ మాట్లాడుతూ కౌలు రైతులకు రుణ పరిమితి ప్రకారం వ్యవసాయ రుణాలు ఇవ్వనున్నట్లు పేర్కొన్నారు. భూ యజమాని ఆ భూమి పేరుతో రుణం తీసుకోకుండా ఉంటేనే కౌలు రైతులకు రుణం మంజూరు చేస్తామని చెప్పారు. కౌలు రైతులు బ్యాంకు రుణం కోసం వచ్చే సమయంలో తప్పనిసరిగా భూయజమానితో సంతకం చేయించుకొని రావాలన్నారు. నిబంధనల ప్రకారం అర్హతగల కౌలు రైతులందరికీ రుణాలు ఇవ్వనున్నట్లు తెలిపారు. ఏఓ ప్రసాదరావు, బ్యాంకు ఫీల్డ్ ఆఫీసర్ అరవిందన్, వీఏఏ నాగరాజు, కౌలు రైతులు పాల్గొన్నారు.

పులులను సంరక్షించాలి


అవగాహన సదస్సు నిర్వహిస్తున్న అధికారులు

గిద్దలూరు రూరల్: అడవిలోని పులులను సంరక్షించాల్సిన బాధ్యత అందరిపై ఉందని గిద్దలూరు రేంజ్ ఆఫీసర్ కుమార్‌రాజా అన్నారు. అంతర్జాతీయ పులుల దినోత్సవం సందర్భంగా మండలంలోని సంజీవరాయుడుపేట జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు పర్యావరణ సమతుల్యతలో పులి ప్రాముఖ్యతపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రస్తుతం మన అటవీప్రాంతం నాగార్జునసాగర్ శ్రీశైలం టైగర్ రిజర్వుడులో భాగంగా ఉందన్నారు. పులుల సంరక్షణకు నీటి వసతిలో భాగంగా సోలార్ బోర్‌వెల్స్ ద్వారా కుంటల ద్వారా, చెక్‌డ్యామ్‌ల ద్వారా నీటి వనరులను ఏర్పాటు చేస్తున్నామన్నారు. పులులు ఆహారంగా తీసుకునే శాఖాహార జంతువుల పెంపుదలకై గడ్డిభూముల పెరుగుదలకు కృషి చేస్తున్నామన్నారు. డీఆర్‌ఓ రాజశేఖర్‌గౌడ్, ఎఫ్ఎస్ఓ ఇంద్ర, ఎఫ్‌బీఓలు అంకయ్య, ఉమాదేవి, చంద్రారెడ్డి,చాంద్‌బాష, రఫీ, సిబ్బంది పాల్గొన్నారు.

వైఎస్సార్ సీపీ నేతలకు 'అన్నా' పరామర్శ


హర్షితను పరామర్శిస్తున్న మాజీ ఎమ్మెల్యే అన్నా రాంబాబు

మార్కాపురం: మార్కాపురం పట్టణంలో అనారోగ్యానికి గురై చికిత్స పొందుతూ ఇంట్లో విశ్రాంతి తీసుకుంటున్న వైఎస్సార్ సీపీ నేతలను మాజీ ఎమ్మెల్యే అన్నా రాంబాబు పరామర్శించారు. 16వ వార్డు కౌన్సిలర్ దారివేముల హర్షిత ఇటీవల కాలు సర్జరీ చేయించుకున్నారు. అన్నా రాంబాబు ఆమె నివాసానికి వెళ్లి పరామర్శించి క్షేమ సమాచారాలు తెలుసుకున్నారు. మున్సిపల్ మాజీ చైర్మన్ దూదేకుల మీరావలి గుండె సంబంధిత శస్త్రచికిత్స చేయించుకోవడంతో ఆయన నివాసానికి కూడా వెళ్లి పరామర్శించారు. ఆరోగ్యంపై జాగ్రత్త వహించాలని సూచించారు. ఆయన వెంట పత్తి కృష్ణ, నజీర్ అహ్మద్, పలువురు వైఎస్సార్ సీపీ నేతలు ఉన్నారు.

జెడ్పీ స్కూలు వజ్రోత్సవానికి ఆహ్వానం


శానిటరీ నాప్‌కిన్స్‌పై అవగాహన కల్పిస్తున్న ట్రస్టు సభ్యులు

తర్లుపాడు: స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఏర్పాటై 75 వసంతాలు పూర్తయిన సందర్భంగా సోమవారం నుంచి వజ్రోత్సవ వేడుకలు ప్రారంభమైనట్లు హెచ్‌ఎం సుధాకర్ తెలిపారు. ఇందులో భాగంగా వజ్రోత్సవ స్థూప నిర్మాణం, విద్యా వనం, భోజనశాల నిర్మాణం, బాలబాలికలకు డైనింగ్ టేబుల్స్, ముఖ ద్వార నిర్మాణం, కాంక్రీట్ రూట్, ప్లే గ్రౌండ్ తదితర అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టనున్నారు. ఆగస్టు 15న భారీ జాతీయ పతాకంతో తర్లుపాడు వీధుల్లో వజ్రోత్సవ ర్యాలీ నిర్వహించనున్నట్లు హెచ్‌ఎం తెలిపారు. పూర్వ విద్యార్థులు, దాతలు, విద్యావేత్తలు వజ్రోత్సవ వేడుకల్లో పాల్గొనాలని కోరారు.

శానిటరీ నాప్‌కిన్స్ పంపిణీ

విజయవాడకు చెందిన జన క్రాంతి ట్రస్టు, స్థానిక వాసవీక్లబ్ సారథ్యంలో స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల, లూథరన్ ఉన్నత పాఠశాల, మీర్జపేట జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో విద్యార్థినులకు శానిటరీ నాప్‌కిన్స్‌ను పంపిణీ చేశారు. వ్యక్తిగత శుభ్రత, శానిటరీ నాప్‌కిన్ల వినియోగం గురించి ట్రస్టు సభ్యులు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో వాసవీ ట్రస్టు సభ్యులు పి.లక్ష్మీ నారాయణ, కిరణ్, బి.లక్ష్మీదేవి, పీవీ సావిత్రి, ప్రధానోపాధ్యాయురాలు కెజియా రాణి, కె.ప్రవీణ్‌కుమార్, మస్తానయ్య తదితరులు పాల్గొన్నారు.

అక్రమ తొలగింపులు ఆపాలి

● సబ్ కలెక్టర్ కార్యాలయం ఎదుట సీఐటీయూ ధర్నా



ధర్నా చేస్తున్న మధ్యాహ్న భోజన పథకం కార్మికులు

మార్కాపురం రూరల్: రాష్ట్రంలో మధ్యాహ్న భోజన పథకం కార్మికులను అక్రమంగా తొలగించడాన్ని మానుకోవాలని సీఐటీయూ జిల్లా కార్యదర్శి డీకేఎం రఫీ ప్రభుత్వాన్ని కోరారు. సోమవారం మార్కాపురం సబ్‌కలెక్టర్ కార్యాలయం ఎదుట మధ్యాహ్న భోజన కార్మికులతో కలిసి ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. గత 23 ఏళ్లుగా విధులు నిర్వహిస్తున్న కార్మికులను అకారణంగా రాజీనామా చేయాలని బలవంతం చేస్తూ, బెదిరించడం పద్ధతి కాదన్నారు. గతంలో ఇదే కార్మికులు సమస్యలపై ఆందోళన చేసిన సందర్భంలో తమ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే పరిష్కరిస్తామని ప్రస్తుత ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు హామీ ఇచ్చారన్నారు. అధికారంలోకి వచ్చిన తర్వాత సమస్యలు పరిష్కరించకపోగా ఉన్న ఉపాధిని ఊడగొట్టే చర్యలకు పూనుకోవడం విచారకరమన్నారు. క్షేత్ర స్థాయిలో కొందరు నాయకులు చిరుద్యోగులను తొలగిస్తూ ఇబ్బంది పెడుతున్నారన్నారు. తొలగించిన కార్మికులను వెంటనే విధుల్లోకి తీసుకోవాలని, లేదంటే ఆందోళన ఉధృతం చేస్తామని హెచ్చరించారు. అనంతరం డిమాండ్లతో కూడిన వినతిపత్రాన్ని సబ్‌కలెక్టర్‌కు అందించారు. కార్యక్రమంలో సీఐటీయూ నాయకులు నాగరాజు, సుబ్బలక్ష్మమ్మ, ఈశ్వరమ్మ, బాలనాగమ్మ, కొండమ్మ, తిరుపతమ్మ, లక్ష్మీ తదితరులు పాల్గొన్నారు.